www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 12 | నవంబర్ | 2025 పేజీలు : 8

## విద్య ద్వారానే పేదరికం నుంచి విముక్తి



-జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్

2లో

# పైలెట్ గ్రామంలో ఆగిన ఇంటి నిర్మాణాలు..!

**-బేస్మెంట్‌తోనే నిలిచిపోయిన ఇందిరమ్మ ఇండ్లు**
**-ఇప్పటికీ లబ్ధిదారులకు రూపాయి మంజూరు కాని వైనం**
**-దిక్కు తోచని స్థితిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు**





**ప్రజాపక్షం/జూలూరుపాడు :** కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న చందంగా మారింది ఇందిరమ్మ లబ్ధిదారులు పరిస్థితి. కోటి ఆశలతో నివసించే నీడని తీసేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేపడితే బెస్మెంట్ లెవల్ బిల్లులు రాకపోవడంతో లబ్ధి దారులు కన్నీరు పెట్టు కోవాల్సి వస్తుంది. అధికారులు అవగాహన కల్పించడంలో లోపమో, లబ్ధిదారులకు తెలియక జరగడమో, అది కాస్త బిల్లులు మంజూరుకు అడ్డంకిగా మారింది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్టు కింద భద్రాద్రి కొత్త గూడెం జిల్లా జూలూరుపాడు మండలం ఆనంతారం గ్రామం ఎంపికై 85 ఇండ్లు మంజూరయ్యాయి. ఈ ఇండ్ల నిర్మాణానికి అధికారులు లబ్ధిదారులతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి, నిర్మాణంపై పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారం భించగా 82 ఇళ్ళు సజావుగా నిర్మాణాలు జరుగుతుండగా, వివిధ కారణాలతో మిగతా 2లో..

# ఈ సారైనా ఏర్పాటయ్యేనా?



**- భద్రాచలం ట్రస్ట్‌బోర్డు నియామకానికి కసరత్తు**
**- రెండోసారి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం**
**- ఆశావహుల్లో మరోసారి ఉత్సాహం**
**- ఆ ముగ్గురు మంత్రులకు తలనొప్పిగా మారిన వ్యవహారం**

**ప్రజాపక్షం/భద్రాచలం :** అదిగో మేక.. ఇదిగో పులి అన్న చందంగా తయారైంది భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థాన పాలక మండలి నియామకం. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ట్రస్ట్‌బోర్డు వ్యవహారాన్ని ప్రక్కకు పెట్టింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండో సారి పాలకమండలి నియామకం ఉత్తజెండా ఉపడంతో ఈ సారైనా పాలక మండలి నియామకం జరిగేనా ఆనే అనుమానాలను రామ భక్తులు వ్యక్తం చేస్తున్నారు.

**రెండోసారి...**

2010 నవంబర్ 26 నుండి 2012 నవంబర్ 25వ తేది వరకు రామాలయంలో 13వ పాలకమండలి విధులు కొనసాగించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పాలక మండలి నియామకం 10 ఏళ్లపాటు కాక పోవడంతో కొత్తగా అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు అవుతుందని భక్తులు భావించారు. అయితే భక్తుల మనోభావాలను గౌరవిస్తూ గత ఏడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పలు ఆలయాలతో పాటు భద్రాచలం రామాలయం ట్రస్టుబోర్డు ఏర్పాటుకు మొదటి సారిగా 2024 డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. అయినప్పటికీ పలు కారణాల చేత ఆగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం గత మూడు రోజుల క్రితం మిగతా 2లో..

# వీడని హత్య కేసు మిస్టరీ





**-పోలీసులకే సవాల్‌గా మారిన సామినేని హత్య**
**-రోజుకో వదంతి.. డిఐజికి సిపిఎం ఫిర్యాదు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జిల్లాలో సంచలనం సృష్టించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన సామినేని రామారావు హత్య కేసు మిస్టరీ విడడం లేదు. 12 రోజులుగా పోలీసులు విభిన్న కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నా నిందితులు ఎవరో తేల్చకపోవడంతో పోలీసులపై ఒత్తిడితో పాటు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత నెల 31న ఉదయం ఆరు గంటల సమయంలో చింతకాని మండలం పాతర్లపాడులో ఆయన ఇంటి వద్దనే దుండగులు కత్తితో పొడిచి రామారావును హత్య చేశారు. ఈ హత్యలో ఎంత మంది పాల్గొన్నారు, హంతకులు ఎవరు, కిరాయి హంతకులైతే హత్యకు పురామయించింది ఎవరు మిగతా 2లో..

# పైలెట్ గ్రామంలో ఆగిన ఇంటి నిర్మాణాలు..!



(మొదటిపేజీ తరువాయి)
ముగ్గురు ఇళ్లకు బిల్లులు మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. బేస్‌మెట్ లెవల్ వరకు పూర్తి కాగా లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రూపాయి కూడా రాలేదని, అప్పులు తీసుకొచ్చి బేస్‌మెట్ వరకు నిర్మించినట్లు. ప్రస్తుతం పనులను నిలిపేసినట్లు పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

### ఉన్న రేకులు షెడ్డు తీసేసి..!

ప్రజాపాలనలో సొంతింటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఉచితంగా ఇస్తామని ప్రకటించటంతో అనంతారం గ్రామానికి చెందిన ఈసం రమాదేవి అనే మహిళ ఉన్న రేకుల షెడ్డు తీసేసి ఆ స్థలంలో ఇందిరమ్మ కొత్త ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు ఇంటి నిర్మాణం బేస్‌మెంట్ వరకు పూర్తైనా ప్రభుత్వం నుంచి రూపాయి రాకపోవడంతో ఆ పనులను నిలిపేసింది. ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకుందామని. తెలిసిన వారి వద్ద వడ్డీకి డబ్బును అప్పు తీసుకొచ్చి మెటీరియల్ కొనుగోలు చేసి కొత్త ఇంటి పనులను చేపడితే. ప్రభుత్వం నుంచి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

### బిల్లుల కోసం నిబంధనలెన్నో..!!

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు ఇచ్చే రూ. ఐదు లక్షలను నాలుగు విడతలుగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బేస్‌మెట్ స్థాయి వరకు నిర్మించిన వారికి రూ. లక్ష, ఆపైన నిర్మాణాలు జరిపిన వారికి లక్షాయాభై వేలు, లక్షా యాభై వేలు రెండు దఫాలుగా, ఇండ్ల నిర్మాణం పూర్తైన తర్వాత రూ.లక్ష ఇస్తామని ప్రకటించింది. అయితే బేస్‌మెంట్ వరకు నిర్మాణాలు పూర్తి కాగానే రావాల్సిన లక్షరూపాయల బిల్లులు మాత్రం ఇంకా రావడం లేదు. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తైన లబ్ధిదారుల రూ.లక్ష బిల్లు కోసం వారు బ్యాంక్‌లో అకౌంట్ తెరిచి ఆధార్‌లింకు చేయాల్సి ఉంటుంది. ఆధార్ లింక్ కాగానే బేస్‌మెంట్ వరకు చేపట్టిన నిర్మాణం వద్ద లబ్ధిదారులు ఫొటోలు దిగి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే బిల్లులు వారికి మంజూరవుతాయి.

### బిల్లులు త్వరగా చెల్లించాలి...

**- కుంజా ఆదిలక్ష్మి, అనంతారం గ్రామం....**

ఇందిరమ్మ ఇండ్ల కట్టుకోమని అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పదే పదే చెప్పడంతో ఉన్న రేకుల ఇల్లు తీసి ఇంటిని చేపట్టి బేస్మెంట్ లెవల్ వరకు సొంత ఖర్చులతో నిర్మాణం చేపట్టాం. ఆ పనులకు ఇంకా రూపాయి రాకపోవడంతో మిగిలిన పనులను చేపట్టే స్థితిలో లేక ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే, ప్రభుత్వం స్పందించి త్వరగా బిల్లులను చెల్లించి, ఆదుకోవాలి.

అప్పులు చేసి బేస్‌మెంట్ వరకు పూర్తి చేశా..

**- వజ్జ బేబీ భర్త అనంతారం గ్రామం..**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా కొత్త ఇంటిని నిర్మించేందుకు సొంత డబ్బులతో స్థలం కొని ఆ స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించా. ప్రస్తుతం ఖాళీ స్థలంలో రేకుల షెడ్డు వేసి కుటుంబంతో కలిసి జీవిస్తున్నా. ప్రభుత్వం వెంటనే బిల్లులను చెల్లిస్తే స్లాబ్ వేసుకుని మళ్లీ ఆ ఇంట్లోకి వెళ్లిపోతా. అధికారులు స్పందించి బిల్లులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

## నేడు పాల్వంచలో సిపిఐ జిల్లా స్థాయి సమావేశం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం బుధవారం పాల్వంచలోని కేఎల్ఆర్ డిగ్రీ కాలేజీ రోడ్‌లోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నిర్మాణ బాధ్యులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో సిపిఐ వందేళ్ల వేడుకలు, రాష్ట్ర, జిల్లా ప్రచార జాతాలు, పైలాన్ల ఏర్పాటు, జన సమీకరణ, జన సేవాదళ్ క్యాంపుల నిర్వహణ, స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సభ్యత్వం పునరుద్ధరణపై చర్చించనున్నట్లు తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని పాషా కోరారు.

## విద్య ద్వారానే పేదరికం నుంచి విముక్తి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్య ద్వారానే పేదరికం నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటి నెహ్రూ నాయకత్వంలోని క్యాబినెట్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారన్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవంగా వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. హిందీ, అరబిక్, బెంగాళి, ఇంగ్లీష్ భాషలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పండితుడని, 11 సంవత్సరాల పాటు విద్యా శాఖ మంత్రిగా పని చేశారన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు చదువుకోవాలనే ఆశయంతో కుల, మత బేధాలు లేకుండా పనిచేశారన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తించిన ప్రభుత్వం 1992లో భారతరత్న అవార్డు అందజేసి గౌరవించిందని కలెక్టర్ తెలిపారు. పేదరికం విద్యతోనే మాత్రమే దూరమవుతుందని భావించి ప్రతి పేద వానికి విద్య అందే దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. వ్యక్తిగతంగా మతపరమైన సాంప్రదాయాలు పాటిస్తూ మనమంతా భారతదేశంలో భాగమని తెలిపారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ విద్యపై దృష్టిపెడుతూ గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేకంగా మైనార్టీ బాలికల విద్యపై దృష్టిసారించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఇక్కడ అన్ని కులాలు, వర్గాల వారు కలిసి చదువుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి. కళావతిబాయి, జిల్లా మైనార్టీ శాఖాధికారి ముజాహిద్, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ సారైనా ఏర్పాటయ్యేనా?

(మొదటిపేజీ తరువాయి)
మరోసారి నోటిఫికేషన్ ఇచ్చేందుకు పచ్చజెండా ఊపడంతో త్వరలో దేవాదాయా ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

### మరో సారి ఉత్సాహం...

రామాలయం ట్రస్టుబోర్డులో పనిచేయాలని స్థానికులతో పాటు రాష్ట్రంలో ఉన్న అనేక మంది ఆశపడుతున్నారు. ఇందులో భాగంగా గడ ఏడాది డిసెంబర్లో మొదటి సారి నోటిఫికేషన్ విడుదల కావడంతో సుమారు 60 మంది వరకు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో నిరాశకు గురైన వారంతా రెండో సారి నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో మరోసారి ఉత్సాహం నిండుకుంది. ఇందులో భాగంగా ఇప్పట్నుంచే వారంతా పావులు కదుపుతూ పైరవీలు, ప్రదిక్షణలు, ప్రసన్నతల కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

### ముఖ్య సమయాల్లో అవసరం...

భద్రాచలం రామాలయం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పుణ్యక్షేత్రం. దీనిని దక్షిణ అయోధ్యగా కూడా పిలుచుకుంటారు. నిత్యం వేలాది మంది భక్తులు రాముల వారి దర్శనం కోసం విచ్చేస్తుంటారు. సెలవులు సమయాల్లో ఇసుకేస్తే రాలని భక్తులు ఉంటారు. ఇంతట రద్దీగా ఉండే ఆలయానికి ట్రస్టు బోర్డు లేకపోవడంతో ఆలయ కార్యనిర్వాహణాధికారిపై పెద్దఎత్తున భారం పడుతోంది. గత ఏడాది ముక్కోటి సమయంలో పాలక మండలి కొలువు తీరుతుందని ఆశించారు. ఈ ఏడాది ముక్కోటి నాటికైనా ట్రస్టు బోర్డు నియామకం జరిగితే కార్యక్రమాల నిర్వహణలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా 2027 లో గోదావరి పుష్కరాలు జరిగనున్న నేపథ్యంలో పాలకమండలి అవసరం ఎంతైనా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చొరవచూపాలని రామభక్తులు కోరుతున్నారు.

### ఆ ముగ్గురు మంత్రులకు తొలనొప్పిగా...

భద్రాచలం పాలక మండలి వ్యవహారం ఉమ్మడి జిల్లాకు చెందినమంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డికి తలనొప్పిగా మారే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలో ఎవరి వర్గం వారికి బలంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. పాలక మండలి చైర్మన్ పదవి ఏ వర్గానికి చెందిన వారిని వరిస్తోందో, ఎవరి మెడలో వరమాల పడుతుందో అనే చర్చ తీవ్రంగా సాగుతోంది. మరో ప్రక్త దేవాదాయధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ సైతం భద్రాచలం కేంద్రంగా తన వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్లు వినికిడి. ఈ మధ్య కాలంలో మంత్రులు పొంగులేటి, కొండా సురేఖల మధ్య విభేదాలు రచ్చకెక్కడంతో భద్రాచలం పాలక మండలి వ్యహారంలో వీరిద్దరి వర్గాల మధ్య పోటీ సహజంగానే ఏర్పడే అవకాశం ఉంది. మరో ప్రక్క సీనియర్ మంత్రి తుమ్మలకు సైతం బలమైన వర్గం ఇక్కడ ఉంది. ఆయన వర్గానికి చెందిన పలువురు పాలకమండలిలో పావులు కదిపేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఇక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్కకు కూడా ప్రత్యేక వర్గం ఉండనే ఉంది. ఇదిలా ఉండగా స్థానికంగా ఉన్న భద్రాచలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య రెండు వర్గాలుగా పనిచేస్తుండగా, డా.తెల్లం వెంకట్రావు తన రాజకీయ గురువైన పొంగులేటి వర్గానికి, పొదెం వర్గం భట్టి వర్గం వైపు మొగ్గు చూపనున్నారు. దీంతో భద్రాచలం పాలక మండలి వ్యవాహారం ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులకు తలనొప్పిగా మారింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## వీడని హత్య కేసు మిస్టరీ

(మొదటిపేజీ తరువాయి)
అన్న దానిపై పోలీసు దర్యాప్తు ఒక కొలిక్కి రాలేదు. రామారావుది ముమ్మాటికి రాజకీయ హత్యేనని ప్రత్యర్థులు కాంగ్రెస్‌కు చెందిన వారు హత్య చేశారని సిపిఎం ఆరోపిస్తూ హంతకులను అరెస్టు చేయాలని ఆందోళనలు నిర్వహించింది. హత్య కేసుకు సంబంధించి రోజుకో వదంతి ప్రచారం జరుగుతుంది. సిపిఎం రాజకీయ హత్య అని వాదిస్తుండగా ఆర్థిక పరమైన లేదా మరో కోణంలో హత్య జరిగిందా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితులందరి ఫోన్‌లో కాల్‌లిస్టు ద్వారా దర్యాప్తు చేశారు. హత్య జరిగిన సమయంలో నిందితులు ఎవరు పట్టుబడకపోవడం ఆ తర్వాత హత్యకు సంబంధించి ఎటువంటి ఆధారాలు దొరకక పోవడం సమస్యగా మారింది. కిరాయి హత్యేనని నిర్ధారణకు వచ్చినప్పటికీ ఎవరు హత్య చేయించారు, ఎందుకు చేయించారు అన్న దానిలో మాత్రం స్పష్టత లేదు. కనీసం ఇంత వరకు అనుమానితులను సైతం గుర్తించ లేదు. జిల్లాలో చాలా రాజకీయ హత్యలు గతంలో జరిగినప్పటికీ ఎప్పుడు ఇటువంటి పరిస్థితి లేదు. మూడు దశాబ్దాలుగా రాజకీయ నాయకులను కిరాయి హంతకులు హత్య చేసిన సందర్భం లేదు. 73 ఏళ్ల వయస్సు ఉన్న రామారావును రాజకీయ ప్రత్యర్థులే హతమార్చారా దీని వెనక రాజకీయ కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న దర్యాప్తులోనూ పోలీసులు ఓ నిర్ధారణకు రాలేకపోతున్నారు. ఇదిలా ఉండగా సిపిఎం మాత్రం పోలీసులపై నేరుగా విమర్శలు చేస్తుంది. అధికార కాంగ్రెస్ చెప్పినట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ పోలీస్ ఉన్నతాధికారులపైనే నేరుగా విమర్శలు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ చెప్పినట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారని రామారావు సతీమణి ఐదుగురు నిందితులపై ఫిర్యాదు చేయగా ఇంత వరకు ఒక్కరిని కూడా విచారించలేదన్న విమర్శ సిపిఎం వైపు నుంచి బలంగా వినిపిస్తుంది. స్థానిక పోలీసుల తీరును బహిరంగంగానే విమర్శిస్తున్న సిపిఎం నేతలు మంగళవారం డిఐజిని కలిసి హత్య కేసుకు సంబంధించి ఫిర్యాదు చేశారు. త్వరితగతిన కేసు వివరాలను తేల్చాలని వినతి పత్రం సమర్పించింది.

## నూతన జిఎంకు సింగరేణి బాధితుల సన్మానం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నందు నాయక్ ఆధ్వర్యంలో సింగరేణి బాధిత గ్రామాల సభ్యులు సత్తుపల్లి ఏరియాకి నూతనంగా నియమితులైన జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నందు నాయక్ మాట్లాడుతూ సత్తుపల్లి ని సింగరేణి ఏరియాగా ఏర్పాటు చేసి జనరల్ మేనేజర్ నియామకం చేపట్టటం ఆనందంగా ఉందన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాలను, గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.డి ఇస్రార్ అహ్మద్ (సత్తుపల్లి), విప్పపువ్వు అప్పారావు(రేజర్ల), లకావత్ ప్రసాద్ (ఆర్.టి.ఐ స్టేట్ అడ్వకేట్), హలవత్ అర్జున (రుద్రాక్ష పల్లి), మారోజు అశోక్ (అంబేద్కర్ నగర్), ఎస్.కె నజీమ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.



## అతిథి అధ్యాపకుల వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం తమను రెన్యువల్ చేయాలని అతిథి అధ్యాపకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబుకు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అతిథి అధ్యాపకులు మోత్కూరి రామకృష్ణ మాట్లాడుతూ 494 మంది అతిథి అధ్యాపక పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతిచ్చిందని ఈ పోస్టులకు గతంలో పనిచేసిన అతిథి అధ్యాపకులను సీనియారిటీ ప్రకారం నియమించాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో నాలుగు నెలలకు సంబంధించిన వేతనం పెండింగ్‌లో ఉందని ఆయన తెలిపారు. రాబోయే వార్షిక పరీక్షల నేపథ్యంలో పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే అతిథి అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రజని, వెంకటకృష్ణ, ప్రమీల, సన, స్నేహమాల తదితరులు ఉన్నారు.

# తెలంగాణ మట్టి వాసనకు ప్రతిబింభం అందెశ్రీ కవిత్వం



**-టియుడబ్ల్యూజె (ఐజెయు) ప్రధాన కార్యదర్శి రాంనారాయణ**
**-ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో అందెశ్రీకి నివాళి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ మట్టి వాసనకు ప్రతిభింభం అందెశ్రీ కవిత్వమని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ తెలిపారు. ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రచయిత, కాలమిస్ట్ అందెశ్రీ సంతాప సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్ర పటానికి పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సభలో రాంనారాయణ మాట్లాడుతూ నిరుపేద, నిరాక్షరాస్యుడైన అందెశ్రీ గొర్రెల కాపరి నుండి ప్రజా కవిగా ఎదిగారన్నారు. పల్లె జీవితంలోని కన్నీళ్లు, కష్టాలు, ప్రకృతిలో మార్పులు, మనుషుల బాధలను లోతుగా గమనించడం, అనుభవించడం ద్వారా అందెశ్రీ సహజసిద్ధమైన హృదయాన్ని కదిలించే అసు కవిత్వంతో అతి తక్కువ సమయంలోనే ప్రజాకవిగా ఎదిగారన్నారు. తన పాటలతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాంక్షను రగిల్చి లక్షలాది మందిని ఉద్యమ చైతన్యం వైపు మళ్లించారన్నారు. ఆయన రాసిన జయ జయహే తెలంగాణ గీతం రాష్ట్ర గీతమైందన్నారు. ఆయన జీవితం, సాహిత్యం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపారావు, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్, నగర కోశాధికారి ఏలూరి వేణు, ప్రెస్‌క్లబ్ కోశాధికారి కళ్యాణ్, ఉపాధ్యక్షులు గండారపు రామారావు, సహయ కార్యదర్శి శివాజీ, నాయకులు వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# 17న పెన్షనర్ల మహాధర్నాను జయప్రదం చేయండి

**-రాష్ట్ర నాయకురాలు మేరీ ఏసుపాదం**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెన్షనర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసనగా ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశం మంగళవారం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన కృషి భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో మేరీ ఏసుపాదం మాట్లాడుతూ దాదాపు 20 మాసాలుగా పెన్షనర్లకు రావాల్సిన నగదు బకాయిలను చెల్లించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులు తమ భవిష్యత్తు జీవితాన్ని గురించి కొన్ని ప్రణాళికలను రూపొందించుకుంటారని ప్రభుత్వ వైఖరి ఆ ప్రణాళికలతో పాటు ఉద్యోగ విరమణ చేసిన వారి ఆలోచనలను ఛిద్రం చేసిందని ఆమె ఆరోపించారు. ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న సమయంలో పొదుపు చేసుకున్న డబ్బులను సైతం ప్రభుత్వం ఇవ్వలేకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆమె అన్నారు. పెన్షనర్ల బకాయిలతో పాటు పెన్షనర్లకు సంబంధించిన పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె తెలిపారు. హెల్త్ కార్డులు, డిఏ, పిఆర్‌సి ఇవి కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 15వేల మంది పెన్షన్‌దారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసి ఆధ్వర్యంలో ఇందిరా పార్కులో ధర్నా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం దిగి వచ్చి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేంత వరకు వివిధ రూపాలలో ఆందోళనలను కొనసాగిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ సందర్భంగా 17న జరిగే మహా ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, శ్యాంసుందర్, కార్యదర్శులు బెల్లం రాధాకృష్ణమూర్తి, ఉడుగు సుధాకర్, తాడి అంజలి, దుగ్గినేని శ్రీనివాసరావు, నూతలపాటి నాగేశ్వరరావు, ఆదినారాయణ, జి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సామినేని హంతకులను అరెస్ట్ చేయాలి

**డీజీపీకి సీపీఎం రాష్ట్ర నాయకుల వినతి**



**ప్రజాపక్షం/చింతకాని :** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్రనాయకులు సామినేని రామారావు హంతకులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఆపార్టీ రాష్ట్ర బృందం మంగళవారం హైదరాబాద్ లో డీజీపీ బి. శివధర్‌రెడ్డి ని కలిసివినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి , పోతినేని సుదర్శన్‌రావులు మాట్లాడుతూ అక్టోబర్ 31న పాతర్లపాడులో ఉదయం 5.30 గంటల సమయంలో అతి కిరాతకంగా రామారావును హత్య చేశారని ఘటన జరిగి 12 రోజులవుతున్నా నేటికి నిందితులను అరెస్ట్ చేయటంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పాతర్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బొర్రా ప్రసాద్, కంచుమర్తి రామకృష్ణ, మద్దినేని నాగేశ్వరరావు, కాండ్ర పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులు న ఘాతుకానికి పాల్పడ్డారని రామారావు భార్య పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటి వరకు కనీసం వారిని విచారించకుండా పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. కేవలం కాంగ్రెస్ నాయకులు తమ మనుగడ కోసమే ఈహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. తక్షణమే ఈ హత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీజీపీ ని కలిసిన వారిలో ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి పాల్గొన్నారు.

# ప్రతిభ చాటిన మర్లపాడు పాఠశాల విద్యార్థులు





**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ పోటీల్లో తమ ప్రతిభను చాటి బహుమతులు, ప్రశంసాపత్రాలను సాధించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని తోట లోహిత ఉచిత కార్పొరేట్ విద్య అందించేందుకుగాను గత ఆదివారం జరిగిన సదిశ మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో జిల్లా స్థాయిలో ఫస్ట్, రాష్ట్రస్థాయిలో నాల్గొవ ర్యాంకు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు పి.భీమరాజు తెలిపారు. అదేవిధంగా టి ఎస్ ఎటి, టిఎస్ జిహెచ్‌ఎ సంయుక్తంగా ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వార్షిక జిల్లాస్థాయి ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారని తెలిపారు. ఉపన్యాస పోటీల్లో నరెడ్ల లక్ష్మీ, తిరుపారెడ్డి ప్రథమ స్థానం సాధించగా , వ్యాసరచన పోటీల్లో వడ్డెరపు ఉమాదేవి రాష్ట్రస్థాయికి ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నెలవారి తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి అవి పనిచేస్తున్నాయా లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మోగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టల వారి వివరాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. నిరంతర నిఘాతో పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి అంతస్తు ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎంఏ రాజు, ఎన్నికల డిటి అన్సారీ, ఆర్‌అండ్‌బి ఏఈ లలిత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన జిల్లా విద్యాశాఖాధికారిణి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా విద్యాశాఖాధికారిణిగా నియామకమైన చైతన్య జైని బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం చైతన్య జైని బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిఈవోకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజను డిఈవో చైతన్య జైని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

# శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు భారీగా తరలి రావాలి




**ప్రజాపక్షం/చింతకాని :** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు ప్రతి ఒక్కరూ తరలి రావాలని సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు కోరారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ప్రచారంలో భాగంగా మంగళవారం చింతకాని మండలంలోని మత్కేపల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో వాల్ పెయింటింగ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దూసరి గోపాలరావు మాట్లాడుతూ పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఖమ్మంలో జరగటం చాలా అదృష్టం అన్నారు. ఈ సభకు దేశం నలుమూలల నుంచి ప్రతినిధులు వస్తున్నారని ఈ సభకు ఊరూ వాడ తరలి రావాలన్నారు. గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని ఈ సభకు వచ్చే విధంగా ఉత్తేజపరచాలన్నారు. కవాతు దళాలను, మహిళలను, రెడ్ షర్ట్ వాలంటర్లను చింతకాని మండలం నుంచి భారీగా తరలించాలన్నారు. పార్టీ వందేళ్ల పండుగను ప్రతి ఇంటి పండుగగా భావించి , గ్రామాల్లో వాల్‌రైటింగ్ , ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. చింతకాని మండలం నుంచి 5వేలకు తగ్గకుండా తరలి వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి బండి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# డీలర్లు చట్టాలకు లోబడి వ్యవహరించాలి



**ప్రజాపక్షం/మధిర :** ఎరువులు, పురుగుమందుల దుకాణాల డీలర్లు చట్టాలకు లోబడి వ్యవహరించాలని మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయచంద్ర పేర్కొన్నారు. మంగళవారం మధిర రైతువేదికలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు డీలర్లు, సొసైటీ సిఇఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను పిఓఎస్ మిషన్ ద్వారా అమ్మాలని, ఏ రోజుకు ఆరోజు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. లైసెన్స్‌ల్లో ఓఫాములు పిసిలను ఇంక్లూడ్ చేసుకోవాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. రాబోయే యాసంగిలో యూరియాని రైతుల సాగు విస్తీర్ణం ప్రకారం జాగ్రత్తగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో మధిర వ్యవసాయ అధికారి కె.సాయిదీక్షిత్, వ్యవసాయ విస్తారణాధికారి జిష్ణు, డీలర్లు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.జైదాస్ మాట్లాడుతూ భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న బిరుదాంకితుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప పండితుడని,, స్వాతంత్ర ఉద్యమంలో కూడా ఆయన కీలకపాత్ర పషించారని, పత్రికలను స్థాపించి ప్రజల్లో రాజకీయం చైతన్యం కలిగించారని తెలిపారు. విద్యార్థులంతా ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యలోరాణిస్తూ సమాజ సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ పిఓ బి.తౌరియా, ఆర్ సిహెచ్ సాంబయ్య యు కృష్ణ, జి.కృష్ణ, ఎండి షహీన్‌బేగం, బి. ఉపేంద్, పి కమల, పి.అరుణ, లాలయ్య, దేవదాస్, కె.కొండలరావు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిపిఐలో పలువురి చేరిక



ప్రజాపక్షం/గుండాల : మండల పరిదిలోని కాచ నపల్లి గ్రామానికి చెందిన పూనెం లక్ష్మి నారాయణ , అబ్దుల్ ముజీబ్ లు మంగ ళవారం వాగబోయిన రమేష్ ఆద్వర్యంలో పార్టి జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్‌పాష సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పాష మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు నిరంతరం పనిచేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టి నాయకులు రేసు ఎల్లయ్య, గొగ్గెల క్రిష్ణ, కొమరం హనుమంతు, పాపరావు పాల్గొన్నారు.

## సిఐటియు మండల కన్వీనర్‌గా నిమ్మల మధు



ప్రజాపక్షం/ములకలపల్లి: మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన సిఐటియు మండల మహాసభలో మరో సారి సిఐటియు మండల కన్వీనర్‌గా నిమ్మల మధును ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 22 మందిని మండల కమిటీ సభ్యులుగా దుబ్బా ధనలక్ష్మీ, బుగ్గా వెంకట నర్సమ్మ, ఓరు గంటి శ్రీను, చిక్కుల శ్రీను, గంటా శ్రీనివాసరావు, వర్క రుక్మధ రావు, వగ్గేల దారయ్య, కీసరి జయ, గుగులోతు శంకర్, నల్లి సుజాత, ఎస్‌కే మస్తాన్, సూరం పుల్లారావు, సంగం అంజమ్మ, ముదిగొండ సావిత్రి, నిమ్మల వెంకటేశ్వర్లు, ఉమా, తేజావత్ క్రాంతి, మారగాని గిరి, చిక్కుల అంజి, బోమ్మ వెంకటేష్, వీరితో పాటు మరో ఇద్దరిని ఎన్నుకోవడం జరిగింది. ఈకార్యక్రమంలో సిఐటియు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బా ధనలక్ష్మీ , బుగ్గా వెంకట నర్సమ్మ, ఓరుగంటి శ్రీను, చిక్కుల శ్రీను, వర్క రుక్మధరావు, మేకల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రామ్మూర్తికే బిఆర్ఎస్ మండల అధ్యక్ష పదవి..!



ప్రజాపక్షం/జూలూరుపాడు: బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్య నిర్వ హణ అధ్యక్షులు కేటీఆర్ ఆదేశానుసారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఖాళీగా ఉన్న బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష పదవు లకు జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు కొత్త అధ్యక్షులు నియ మించారు. అందులో భాగంగా జూలూరుపాడు మండలంలో పార్టీ కోసం పనిచేసిన ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన చాపల మదుగు రామ్మూర్తిని నియమించారు. రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ ఆదేశానుసారము కొంతకాలం ఆ కమిటీని రద్దు చేశారు. తాజాగా ఖాళీగా ఉన్న మండలాల్లో అధ్యక్షులని నియమించం డని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం ఆదేశించడంతో ఈ పదవి మరలా చాపల మదుగు రామ్మూర్తికే వరించింది. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ జూలూరుపాడు మండల అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పజెప్పిన కెసి ఆర్, కేటీఆర్, హరీష్ రావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు తాతా మధు సూదన్, రేగా కాంతారావు, యల్లంకి సత్యనారాయణ, గిరిబాబు లకు రుణపడి ఉంటానని తెలుపుతూ జూలూరుపాడు మండల ప్రజల్లోకి మరింత విస్తృతంగా పార్టీని తీసుకెళ్లేందుకు, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత ఉత్సాహంగా కొనసాగించి రాబోయే లోకల్ ఎలక్షన్లలో బీఆర్ఎస్ ను ముందు వరుసలో ఉంచుతా నన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చాపల మదుగు రామ్మూర్తి కీ అభినం దనలు తెలిపారు.

## పీకే ఓసీ ప్రాజెక్ట్ అధికారిని కలిసిన కర్నే



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ఏరియా ప్రతిష్ఠాత్మక గని పీకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏజెంట్) గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మిక్కినేని శ్రీ రమేష్ ని మణుగూరు ప్రాంత గ్రామనివాసి సామాజిక సేవకులు కర్నె బాబురావు మంగళ వారం నాడు తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బాబురావుమాట్లాడుతూ గతంలో 2002 నుండి 2013 వరకు మణుగూరు ఏరియాలో పీకే ఓసి లో అసిస్టెంట్ మేనేజర్ గా విధులు నిర్వహించారు. 2013 నుండి 2015 వరకు కాలరీ మేనేజర్ గా శ్రీరాంపూర్ ఆర్కే వన్ ఎ లో రెండు సంవత్సరాలు విధులు నిర్వహించారు. 2015 నుంచి బెల్లంపల్లి కైరగుడ టు నిర్వహించి 2021 ఏప్రిల్ వరకు పని చేసి పదోన్నతి పై 2021 ఏప్రిల్ కొత్త గూడెం ఏరియా వీకే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ గా బదిలీ అయ్యారు. నవంబర్ పదో తారీకు 2025న మణుగూరు ఏరియా పీకే ఓసి కి ప్రాజెక్ట్ అధికారిగా బదిలీపై వచ్చారని కర్నే బాబురావు తెలిపారు. శ్రీ రమేష్ ఆధ్వర్యంలో పీకే ఓసి కి ఉన్న పేరు ప్రఖ్యాతులు కొనసా గించే విధంగా కార్మికులతో కార్మిక సంఘాలతో కాంటాక్ట్ కార్మికులతో, ఓబి వర్కర్లతో మంచి సంబంధాలు కొనసాగించాలని పీకే ఓసికి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలు సాధించే విధంగా పారిశ్రామిక సంబంధాలు కొనసాగించాలని రక్షణతో కొన్ని ఉత్పత్తికి పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు.

# మద్దతు సరే..బోనస్ ఏది..!?

**-బోనస్ అందటం లేదని ప్రైవేట్ వైపు మొగ్గు**
**-కేంద్రాలు ప్రారంభించినా కొనుగోలు జరపట్లే..**





ప్రజాపక్షం/నేలకొండపల్లి : వానాకాలం పండించిన ధాన్యం ను విక్ర యించుకునేందుకు రైతులు ఆలోచనలో పడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించుకుంటే బోనస్ వస్తుందని ఆశతో గతంలో రైతులు కేంద్రాల వద్ద విక్రయించారు.కానీ నేటి వరకు బోనస్ పడకపో వటంతో రైతులు ప్రవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు. కేంద్రం అందించే మద్ధతు సరే...బోనస్ గురించి అనుమానం తో రైతులు సందిగ్ధంలో పడ్డారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ను ప్రారంభిం చారు. కానీ కొనుగోలు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. దీని వలన రైతులు ఏం చేయాలో అర్ధం కాక ఇంకా పంటలు పొలాలలోనే ఉంచారు. మరి కొంత మంది ప్రవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కేంద్రం పెంచిన మద్ధతు ధర రూ.69 తో పాటు బోనస్ కూడ దక్కా లంటే రైతులు కేంద్రాల వద్దనే విక్రయించాల్సి ఉంది.కానీ బోనస్ అను మానం తో ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి వేస్తు న్నారు. కేంద్రాల వద్ద కు రైతులు రాకపోవటంతో నిరుపయోగంగా మారుతున్నాయి. కొనుగోలు వేగవంతం చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టటం లేదనే విమర్శలు వస్తున్నాయి.

**తడిసిన గింజల పరిస్థితి ఏంటీ...**

ఇటీవల మోంధా తుపాన్ వలన జిల్లాలో అనేక ప్రాంతాలలో వేలాది ఎకరాలలో పంట లు దెబ్బతిన్నాయి. ఇప్పటికే వరి పంట నేలకొరిగే ఉన్నాయి. కొన్ని మండలాలలో తడిసిన గింజ మొలకెత్తుతున్నాయి. ఈ తడిసిన గింజల పరిస్థితి ఏంటీ. జిల్లా అధికారులు మాత్రం మొక్కుబడిగా అంచనాలు వేశారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో పలు మండలాలలో కనీసం అంచనాలు కూడ వేయలేదు. ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ.10 వేలు అసలు నష్టపరిహారం వస్తుందా రాదా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గత రబీలో బోనస్ కోసం పరుగులు తీసి కేంద్రాల లో విక్రయించిన రైతులకు నేటి వరకు వారి కి బోనస్ అందలేదు. ఈ సీజన్ లో అసలే తుపాన్ దెబ్బకి నష్టపోయిన రైతులకు మద్ధతు ధర తో పాటు బోనస్ పొందాలనే వారికి సందేహాలు వెంటాడుతున్నాయి. యాసంగిలో కంటే రెండింతలు వానాకాలం సాగులో ఉంటుంది. ఇప్పుడైనా ఇస్తారా...అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**మద్ధతే ఊరట...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాలు వరి పంట ను సాగు చేశారు. వరి దిగుబడి పెద్ద ఎత్తున వస్తుందని అధికారులు అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్ధతు ధర రైతులకు పెద్ద ఊరటగా చెప్పుకోవచ్చు. దీని వలన జిల్లా రైతాంగం కు భారీ ప్రయోజనం చేకూరనుంది. రైతులు అంతా కొనుగోలు కేంద్రాలో విక్రయిస్తే బోనస్ కింద రాష్ట్ర ప్రభుత్వం కోట్లలో చెల్లించాల్సి ఉంటుంది. రైతులకు వేలాది రూపాయాలు బోనస్ వచ్చే అవకాశం ఉంది. మరీ ఈసీజన్ లో బోనస్ విషయంలో అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే మరి. రైతులకు బోనస్ విషయంలో సృష్టంగా సమా ధానం చెప్పకుంటే కేంద్రాల వైపు చూసే రైతులు కనిపించటం లేదు. అంతా ప్రవేట్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.

**యాసంగి బోనస్‌రాలేదు : మరికంటి శంకర్, రైతు, బైరవునిపల్లి.**



యాసంగి లో కొనుగోలు కేంద్రం కు వేసిన ధాన్యం కు సంబంధించిన బోనస్ నేటి వరకు రాలేదు. ఈ వానాకాలం సీజన్ ధాన్యం ను విక్రయించాలా వద్దా అనే ఆలోచన చేస్తున్నా...రైతులను ఆదుకునేందుకు వెంటనే పెండింగ్ బోనస్ ను అందించాల్సిన అవ సరం ఉంది.

**నష్టపరిహారం చెల్లించాలి : ఎడ్ల తిరపతిరావు, అనాసాగారం, కౌలు రైతు.**



తుపాన్ వలన దెబ్బతిన్న రైతులకు వెంటనే నష్టపరి హారం చెల్లించాలి.ఎకరానికి రూ.10 వేలు కాకుండా కనీసం రూ.20 వేల వరకు చెల్లించాల్సి ఉంది. రైతు లపట్ల ప్రభుత్వం కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే నష్టప రిహారం ను చెల్లించాలి.

**కొనుగోలు కేంద్రాలలో నిబంధనలు సడలించాలి : బాజా నాగేశ్వరరావు, రైతు, సింగారెడ్డిపాలెం.**



కొనుగోలు కేంద్రాలలో నిబంధనలు సడలించి వెంట నే కొనుగోలు చేయాలి. తేమ శాతం పట్ల ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి. ప్రభుత్వం ఈ విధంగా నైనా సహాయం చేయాలి. లేకుంటే రైతులు పరిస్థితి దారుణంగా ఉంటుంది. కొనుగోలు కేంద్రంలో రైతు లకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం




ప్రజాపక్షం/కూసుమంచి: విద్యారంగ సమ స్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని పిడిఎస్‌యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి మస్తాన్ అన్నారు. మంగ ళవారం కూసుమంచి మండల కేంద్రంలో పిడి ఎస్‌యు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళా శాలలో జనరల్ బాడీ నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కూసుమంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కళాశాలలో సొంత బిల్డింగ్ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతూ చదువులను కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు లేక సరిగా గదులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సాక్షాత్ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక మంత్రి అయ్యి ఉండి బట్టి విక్ర మార్క పాలేరు ఎంఎల్ఏ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నియోజకవ ర్గంలోని జూనియర్ కళాశాలలో అనేక సమ స్యలు పరిష్కరించడంలో అలసత్వాన్ని ప్రదర్శి స్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పేద విద్యార్థులకు రావలసిన ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిపు 10వేల 300 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, విడుదల చేయ కుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మీద కక్ష సాధింపులు చేస్తుందని మండిపడ్డారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పిడిఎస్‌యు మండల అధ్యక్ష, కార్యదర్శులు మణి కంఠ గోపి, విజయ్, మహేష్, అశోక్, ప్రవీణ్, తరుణ్, స్వాతిక, రాజే శ్వరి, భార్య సారిక, పాల్గొన్నారు.

## ఘనంగా యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ప్రాంగణంలో మంగళవారం యూనియన్ బ్యాంక్ 107వ వార్షికోత్సవ వేడుకలు ఆళ్లపల్లి బ్రాంచ్ మేనేజర్ ఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈకార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్, క్యాషియర్ బి యల్ రామ్ రాథోడ్, సిఎస్ఏఎమ్ శ్రీనివాసరావు, అటెండర్ ప్రభాకర్, వ్యాపారస్తులు గౌరిశెట్టి శ్రీనివాసరావు, అనమోలా వెంకటేశ్వరరావు, బూరుగడ్డ వెంకటేష్, సిరినోముల నరేష్, తదితరులు పాల్గొన్నారు.



# మిర్చి రైతులకు బూజు తెగుళ్ళ సెగ..!

**-వందలాది ఎకరాల్లో ఎండిపోయిన పంటలు**
**-లబోదిబోమంటున్న రైతులు**
**-ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు**
**-అవగాహన కల్పించని అధికారులు**



ప్రజాపక్షం/కరకగూడెం: మండల పరిధిలో వాణిజ్య పంటగా సాగు తున్న మిరపను అధికంగా పండిస్తారు. కానీ ప్రస్తుతం ఈ పంటకు బుజు తెగులు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత సీజ జన్లో అధిక వర్షాలతో ఎక్కువగా ఉండడం వల్ల దీనికి తోడు వాతావరణ సహకరించడం లేదు. అధికారులు దీనిపై అవగాహన రైతులకు చెప్పడం లేదు. మిర్చికి ధరలేక రైతులు దివాలాతీశారు. ఈ ఏడాదైనా మిర్చికి అధిక ధర లభిస్తుందని భావించిన రైతులకు పంట రాకముందే కొత్త కొత్త తెగుళ్లు రావటం వల్ల బూజు తెగ్గుళ్లు సోకడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరకగూడెం మండల పరిధిలోని చొప్పాల, బట్టు పల్లి, పద్మపురం, అనంతారం, తాటిగూడెం, మద్దెలగూడెం, వెంకటా పురం, బట్టుపల్లి, చిరుమళ్ల వంటి గ్రామాల్లో ఎక్కువగా మిర్చి పంట లను పండిస్తారు. కరకగూడెం, పినపాక మండలల్లో వండే మిర్చికి వరంగల్, గుంటూరు మిర్చి మార్కెట్లో నుండి డిమాండ్ ఉంటుంది. గత ఏడాది మిర్చికి మార్కెట్లో సరిఅయిన ధర లేనప్పటికీ ప్రభుత్వం రైతాం గాన్ని అతలాకుతలం చేసింది. దీనికి తోడు మార్కెట్లకు దీర్ఘకాలికంగా సెలవులు రావడంతో ధర హెచ్చు తగ్గులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంతో పోలి స్తే ప్రస్తుతం 10 నుండి 15 శాతం మిరప సాగు విస్తీర్ణం పెరిగింది. కానీ వంటకు బుజు తెగులు రావడంతో రైతులు చేసేదేమి లేక వంటను పట్టిం దుకోవడమే మానేశారు. అయితే ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి కూడా రాక పోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవి చూడాల్సిస్తుంది. దీంతో గతేడాది కంటే ఈ ఏడాది మిర్చి పంట దిగు బడి చాల వరకు తగ్గుతుందని చెప్పవచ్చు

**రెండు ఎకరాలు బూజు తెగులు వ్యాపించింది : సల్లూరి సుమన్, యువ రైతు**



నేను 2 ఎకరాలు మిరప వంటను సాగు చేస్తు న్నాను. మిరపకు బుజు తెగులు వ్యాపించి నీళ్లు కట్టి క్రమంలో మొత్తం 2 ఎకరాలు వ్యాపించి పంట మొత్తం ఎండిపోయింది. దీంతో చేసేదేమి లేక పంటను వదిలి వేయాల్సి వచ్చింది. ఇప్పటి వరకు సుమారు లక్షలు పెట్టుబడి పెట్టాను. కానీ ఏం ప్రయోజనం లేకండా పోయింది. దీంతో చేసేదేమి లేక వంట ను వదిలేయాల్సి వచ్చింది.

**అధికారులు పట్టించుకోవడం లేదు : గోగు కుమార్ స్వామి, రైతు**



ఎన్నడు లేని విధంగా బుజు తెగుళ్లు పురుగు ఉద్భతి బాగా ఉండటంతో మొక్కలు భారీగా చనిపోతున్నాయి. అంతే కాకుండా వాతావ రణ మార్పుతో ఈ పరిస్థితి ఏర్పడి మిర్చి సాగు రైతులకు శాపంగా మారిందని లబోదిబో మంటున్నారు. కొద్ది మంది రైతులు ఇప్పటికే వేరు కుళ్ళు తీగలతో నానా తంటాలు పండి 10 నుండి 20 శాతం పైగా నష్టపోగామూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు తామర పురుగుతో అనేక రకాల ఇబ్బం దులు పడుతున్నారు. దీంతో కొద్ది మంది మిర్చి తోటలు పూర్తిగా తొల గించి ఇతర పంటలు సాగు చేసే ఆలోచనలో పడ్డారు. బుజు తెగుళ్లు ఎన్ని మందులు కొట్టినా తగ్గటం లేదని రైతన్నలు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి దానికి ఏం చేయాలో పరిష్కారం చెప్పాలని రైతులు కోరుకుంటున్నారు.

## వందేళ్ల పోరాట చరిత్ర కలిగిన సిపిఐని ఆదరించండి

**సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్**



ప్రజాపక్షం/మణుగూరు: పోరాటాల చరిత్ర కలిగిన ఎర్ర జెండా సిపిఐ ను ఆదరించాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్య దర్శి దుర్గ్యాల సుధాకర్ కోరారు. సోమవారం నాడు విఠల్ రావు నగర్ గ్రామంలో సిపిఐ నాయకులు కరపత్రాలు పంచుతూ ప్రచా రం నిర్వహిం చారు. ఈ సందర్భంగా దుర్గ్యాల సుధాకర్ మాట్లా డుతూ కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల కోసం తన నమ్ముకున్న సిద్ధాంతం కోసం కార్మికులు కర్షకులు అణగారిన వర్గాల కోసం నిత్యం సీపీఐ పార్టీ పోరాటాలు కొనసాగిస్తూ అనేక చారిత్రాత్మక పోరాటాలు కొనసాగించిందని , దున్నే వానికి భూమి నినాదం తో, దొరల గడీలను బద్దలు కొట్టి వేలాది ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని, తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించి లక్షలాది ఎక రాలను పేద ప్రజలకు మధ్యన చరిత్ర ఎర్రజెండాదని, కార్మికుల పట్ల, కర్షకుల పట్ల, అణగారిన వర్గాల కోసం నిత్యం పనిచేస్తున్న కమ్యూ నిస్టు పార్టీని ఆదరించాలని, అధికారం లేకున్నా 100 సంవత్సరాల చరి త్రలో సీపీఐ ప్రజల మనసుల్లో బ్రతికే ఉందన్నారు. సిపిఐ శత జయంతి ముగింపు వేడుకలు డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగుతున్నాయని, ఈ వేడుకల కు ఖమ్మం నగరం ముస్తాబు కానుంది అని, ఈ వేడుకల్లో 40 దేశాల నుంచి ప్రతినిధులు సుమారు 5 లక్షల మందితో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించిన ఉన్నామని ఈ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని దీనికోసం మణుగూరు నుండి పెద్ద ఎత్తున ఖమ్మం తరలిరావాలని దీనికోసం అన్ని వర్గాల ప్రజలు సన్నద్ధం కావాలని వారు పిలుపునిస్తూ, గ్రామ గ్రామాన కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ఈ కార్యక్రమంలో పట్టణ కార్యవర్గ సభ్యులు రాయల బిక్షం, మంద కోటి, బొజ్జ సదానందం, ఐత నమైన వెంకన్న, బోశెట్టి సంపత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో భారీ చేరికలు



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మండలంలో కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్నటు వంటి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనంతోగు గ్రామ పంచాయితీ, తిర్లాపురం గ్రామం నుండి పాయం సూరయ్య ఆధ్వర్యంలో 70 కుటుం బాలు, రామానుజగూడెం పంచాయితీ, రామానుజగూడెం గ్రామం, ఇప్పనపల్లి గ్రామం తునికి బండ గ్రామాల నుండి మోకల శేఖర్ ఆధ్వ ర్యంలో 80 కుటుంబాలు పాయం వెంకటేశ్వర్లు సారథ్యంలో మొత్తం 150 వివిధ పార్టీలకు చెందిన కుటుంబాల చేరిక కార్యక్రమంలో పిన పాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సారదంగా పార్టీలోకి ఆయన అహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అవ లంభిస్తున్నటువంటి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై 150 కుటుం బాలు చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాయం రామనర్సయ్య, ప్రచార కమిటీ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు వాసం శ్రీనాథ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు మోకాల శేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు నులకతాటి శ్రీని వాస్, మండల సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, మాజీ ఎంపీపీ పెండెకట్ల పాపారావు, ఎండి హతర్, బుర్ర వెంకన్న, బూత్ కమిటీ సభ్యులు కరకపల్లి సుధాకర్, జీ వసంతరావు, తాళ్లపల్లి వెంకన్న, ఏ అగ్ని చంద, రాంబాబు, కొరస నాగేశ్వరరావు, పాయం సూరయ్య, గొగ్గెల కాంత్, మైనార్టీ సెల్ ఎస్‌డి సాబీర్, బీసీ సెల్ అధ్య క్షులు తాళ్లపల్లి చిరంజీవి, జీ భాస్కర్, యూత్ నాయకులు సుతారి కృష్ణ, ఉల్లూజ్ భరత్, ఎం ప్రశాంత్, నల్లమాస చంద్రబాబు, మంద సాయి, వనప్తి నాని, ముప్పారు రాము, తోట రాజేష్, బొబ్బిలి రామ నరసయ్య, పడిగా రామారావు, కాంగ్రెస్ మహిళ నాయకురాలు వాసం సుశీల, ప్రవీణ, గలిగ సమ్మక్క, మాజీ సర్పంచ్ మడత కుమారి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని బాలుడి మృతి





ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల పరిధి లోని కర్నలబోడు గ్రామంలో మంగళవారం ఉదయం ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొన్న సంఘ టనలో భూక్య దక్షిత్(15నెలలు)బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిస్కెట్ ప్యాకెట్ కొనుక్కొని రోడ్డు దాటుతుండగా బాలుడు స్కూల్ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలోని భూక్య గోపి, అఖిల దంపతులకు రెండేళ్ల క్రితం కవల పిల్లలు అయిన కుమారుడు దక్షిత్ కుమార్తె లాక్ష్య జన్మించారు. వీరిలో కుమారుడు ప్రైవేట్ స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకునేం దుకు గ్రామానికి వచ్చింది. ఈ సమయంలో దక్షిత్ ఇంటి ముందు గ్రామంలోని విద్యార్థు లను బస్సు ఎక్కించుకున్నారు. అప్పుడే రోడ్డు దాటుతున్న దక్షిత్ బస్సు వెనకాల టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కి తరలించారు.

## గణితము, సామాన్య శాస్త్రాలపై శిక్షణ



ప్రజాపక్షం/చంద్రుగొండ: గణితము సామా న్య శాస్త్రాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్య క్రమాన్ని చంద్రుగొండ ఎంఇఓ మహంకాళి సత్యనారాయణ చంద్రుగొండ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభించారు. ఈకార్యక్రమానికి చంద్రు గొండ, జూలూరుపాడు, అన్న పురెడ్డిపల్లి, సుజాతనగర్ మండలాల నుండి 50 మంది స్కూల్ అసిస్టెంట్ గణితము సామాన్య శాస్త్రానికి సంబంధించిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ 5 శిక్షణా కార్యక్రమంను జిల్లా గణిత ఆర్పీలు సిహెచ్ మధుసూదన్‌రావు, ఎం నాగేశ్వరరావు, ఎల్ సునీత, ఎస్ నరేష్, ఫిజికల్ సైన్స్ సంబంధించి ఎండి వాజిద్, రాజశ్రీ, ఇందిరాలు శిక్షలు ఇచ్చారు.

## మృతుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి ప్రగాఢ సంతాపం

ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని మంగళ్‌తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు బానోత్ మంగ్య నాయక్, ధర్మతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ధరావత్ రామోజీ నాయక్‌లు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందార. వారి మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. పార్టీ తరపున తన తరపున మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.

## కూసుమంచి వాసి గుండా సురేంద్రరెడ్డికి డాక్టరేట్



ప్రజాపక్షం/కూసుమంచి: మండల కేంద్రానికి చెందిన గుండా సురేం ద్రరెడ్డికి కాకతీయ యూనివర్సిటీ వృక్షశాస్త్రంలో గౌరవ డాక్టరేట్ ప్రక టించింది. సురేంద్రరెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎథ్నోమెడిసి నల్ ప్లాంట్లపై ఇన్విహో, ఇన్విట్రో అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించారు. ఈసందర్భంగా డాక్టరేట్ ప్రధానం చేసింది. సురేంద్రరెడ్డి ప్రస్తుతం మహబాద్ జిల్లా మరిపెడ బంగ్లా డిగ్రీ కళాశా లలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. సురేంద్ర రెడ్డి ప్రాథమిక ఉన్నత విద్య కూసుమంచి ఉన్నత పాఠశాలలో కొనసాగించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివినా కూడా అద్భుతాలు సృష్టించవచ్చు అని నిరూపించారు. క్రమ శిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలకు చేరవచ్చునని తెలిపారు. డాక్టరేట్ రావడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## సీఆర్‌పిలచే ఒక రోజు శిక్షణ కార్యక్రమం



ప్రజాపక్షం/కరకగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూ లన సంస్థ, వయోజన విద్యా శాఖ ఆధ్వ ర్యంలో అన్ని గ్రామాల్లోని స్వయం సహా యక సంఘం లోని సభ్యులు ప్రతీ ఒక్కరు చదవడం వ్రాయడం నేర్చుకును టకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం రాష్ట్ర సీనియర్ సీఆర్‌పిలచే నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఉల్లాస్ అమ్మకు అక్షర మాల విద్యా బోధన కేంద్రాల నిర్వహణ బాధ్యతలు గ్రామ సమాఖ్య పాలకవర్గ ప్రతిని ధులు బాధ్యతలు, వివోయే ల విధులు భాద్యతలు వాలంటీర్లకు సహాయ సహకారాలు, గ్రామ స్థాయిలో వున్న విద్యా శాఖ, అంగన్వాడీ సేవలు సమన్వయం తో విజయవంతం చేయుటకు చేయవలసిన కార్యక్రమం ల పై ఈ శిక్షణ కార్యక్రమం లో స్టేట్ రిసోర్స్ పర్సన్స్ నాగమణి, నాగలక్ష్మి , ఎపిఎంబి వినోద్ క్రాంతి, ఎమ్ఆర్‌పి, జె.వెంకటేశ్వరరావు, సీసీ విజ యలక్ష్మి , అందరు వివోఏ లు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలును వేగవంతం చేయాలి



**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**- ఖమ్మంరూరల్‌లోని పత్తి కొనుగోలు కేంద్రాలు తనిఖీ**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రభుత్వ ఆదేశాలకనుగనంగా పత్తికొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లి,పొన్నెకల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోలు ప్రక్రియ, ట్యాబ్ ఎంట్రీ, గేట్ ఎంట్రీపాస్, పంట నమోదును పరిశీలించారు. అలాగే రైతులు తెచ్చిన పత్తి తేమశాతంను యంత్రంతో పరిశీలించి,రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు...రైతుల మద్దతు ధరకు పత్తి అమ్ముకునేలా చర్యలు తీసుకున్నామని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. చలిమంచు దృష్ట్యా తేమశాతం కొంతమేర వెసులుబాటు ఇవ్వాలని, అకాల వర్షాల వలన కొంత పంట దెబ్బతిన్నందున గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పత్తి పంటను ఆరబెట్టుకుని 12శాతం నిర్ణీత తేమశాతం వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువెళ్ళాలన్నారు. తెచ్చుకున్న పంటను అదేరోజు కొనుగోలు చేసి రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రధానంగా పత్తి రైతులు కపాస్..కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పత్తి అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిలి రాంప్రసాద్, మద్దులపల్లి మార్కెట్ కార్యదర్శి వీరాంజనేయులు, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాంగణ నియామకాల్లో 70 మంది విద్యార్థులు ఎంపిక




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సహకారంతో నిర్వహించిన టెలీ పర్ఫార్మెన్స్ ప్రాంగణ నియామకాల్లో ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మంగళవారం తెలిపారు. డిజిటల్ బిజినెస్ సర్వీసెస్, ఓమ్ని ఛానెల్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సొల్యూషన్స్ అందిస్తూ భారతదేశంలో 90వేల ఉద్యోగాలు కలిగిన అతిపెద్ద సంస్థలో తమ విద్యార్థులు స్థానం సాధించడం హర్షణీయమన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ 2001లో స్థాపించి 25 సంవత్సరాలుగా బహుళ జాతి సంస్థల వినియోగదారులకు సేవలు అందిస్తున్న టెలీ పర్ఫార్మెన్స్ ఉద్యోగాలకు గాను మొదటి విడతలో నిర్వహించిన గ్రూప్ డిస్కర్షన్‌లో 70 మంది విద్యార్థులు ప్రతిభను కనబర్చారని వారం రోజుల్లో నిర్వహించనున్న ఆపరేషన్ రౌండ్ తుది ఫలితాలు వెల్లడిస్తారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులు కస్టమర్స్ సర్వీస్ అసోసియేట్, కంటెంట్ మోడరేటర్, అనలిస్ట్ హోదాలో ఉద్యోగాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ అమెజాన్, ఫేస్‌బుక్, గూగుల్, యూట్యూబ్ వంటి అంతర్జాతీయ సోషల్ మీడియా సంస్థలు క్లైయింట్ కలిగిన టెలీ పర్ఫార్మెన్స్ సంస్థ తమ కళాశాలను ఎంపిక చేసి నియామకాలు చేపట్టడం గర్వకారణమన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ. 2.4 లక్షల వార్షికాదాయంతో పాటు ఇతర సదుపాయాలు లభిస్తాయన్నారు. ప్రాంగణ నియామకాలకు సహకరించిన టాస్క్ జిల్లా మేనేజర్ పి. దినేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంపికలు నిర్వహించిన టెలీ పర్ఫార్మెన్స్ హెచ్‌ఆర్, క్యాంపస్ రిక్రూటర్ సయన్ చక్రవర్తి, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి



**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహారావు**

**ప్రజాపక్షం/కల్లూరుః** దేశ స్వాతంత్రం కోసం దున్నేవాడికే భూమి కావాలని, భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం కార్మిక వర్గ రక్షణ కోసం కష్టజీవుల కేయూ అండగా 100 సంవత్సరాల క్రితం 1925 డిసెంబర్ 26వ తారీఖున ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ఉత్సవ బహిరంగ సభ డిసెంబర్ 26వ తేదీ 5 లక్షల మందితో నిర్వహించబడుతుందని దీన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు పిలుపునిచ్చారు. కల్లూరు లో బహిరంగ సభ నిమిత్తం విరాళాలు వసూలు చేస్తూ కల్లూరు లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో 100 సంవత్సరాలు గలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, దేశం కోసం, దేశ ప్రజల కోసం, రైతుల కోసం ఎందరో అమరవీరులు త్యాగాలతో వంద సంవత్సరాలుగా ముందు సాగుతున్న కమ్యూనిస్టు పార్టీని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగం పెరిగిపోయిందని, సామాన్యుడు బతకలేని పరిస్థితిలో ధరలు పెరిగిపోయాయని దేశంలో విచ్ఛిన్నకర శక్తులు దేశ రాజ్యాంగానికి ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే పద్ధతుల్లో పరిపాలన సాగుతుందని, లౌకిక భారత దేశాన్ని కాపాడుకోవడానికి కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిందని రానున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయటం ద్వారా ఈ దేశంలో కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు పాల్గొన్నారు.

# ఘనంగా యువజన ఉత్సవాలు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్ రెడ్డి తెలిపారు. 29వ జాతీయ యువజన ఉత్సవాల సందర్భంగా మంగళవారం శ్రీభక్తరామదాసు కళాక్షేత్రంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ జానపద నృత్యం, గ్రూప్ ఫోక్ డ్యాన్స్, జానపద గేయాలు, గ్రూప్ ఫోక్ సాంగ్, వ్యాసరచన, పోస్టర్ తయారీ, వక్తృత్వ పోటీలు, కవిత్వం, ఇన్నోవేషన్ మొదలగు అంశాలలో ప్రదర్శనలు, పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా స్థాయి కళాకారులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలలో 850 మంది యువ కళాకారులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆర్. ఉదయ్‌కుమార్, న్యాయ నిర్ణేతలు జాన్ మాలతి నాయుడు, ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ లెక్చరర్లు కె. రవికుమార్, ఐ. కిరణ్‌కుమార్, బి. శ్రీనివాస్, కె. మధు, జి. వీరన్న, యువజన సంఘాల సమితి అధ్యక్షులు ఉమాశంకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్య జైని తెలిపారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు, వేసవిలో శిక్షణకు హాజరు కాని ఉపాధ్యాయులకు రెండు రోజులు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు డైట్ కళాశాల, శాంతినగర్ పాఠశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలో జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్య జైని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అభ్యాసన ఫలితాలు సాధించడంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రామకృష్ణ, ఉపాధ్యాయులు, ట్రైనర్లు, రిసోర్స్ పర్సన్, డైట్ కళాశాల ఇంచార్జి శ్రీనివాసరావు, శాంతినగర్ పాఠశాల ఇంచార్జి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మౌలానా అబుల్ కలా ఆజాద్ జయంతి వేడుకలను ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా లు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యారంగ అభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ అనిల్ కుమార్, కార్పొరేటర్లు బిజి క్లెమెంట్, రాపర్తి శరత్, ఏసిపి వసుంధర, ఉద్యానవన అధికారిణి రాధిక, ఇటికాల భాస్కర్, సుజాత, ప్రసన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా డెయిరీతో మహిళాభివృద్ధి



**ప్రజాపక్షం/ మధిర :** మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క రాష్ట్రంలోనే తొలిసారిగా మధిర నియోజకవర్గంలో ఇందిరా డైయిరీని ఏర్పాటు చేయ టం జరిగిందని, ఇందిరా డైయిరీతో మహిళాభివృద్ధి సాధ్యమని ఇందిరా డైయిరీ నూతన అధ్యక్షురరాలు బందెల లలిత తెలిపారు. మంగళవా రం స్థానిక ఐకెపి కార్యాలయంలో ఇందిరరా డైయిరీ నూతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ ఇందిరా డైయిరీ ఏర్పాటుతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో తోడ్పాటునందిస్తున్నట్లు, ఇందిరా డైయిరీని సద్వినియోగం చేసుకుని మహి ళా సాధికారితను సాధించాలన్నారు. ఈ సమావేశంలో ఇందిరా డైయిరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ముదిగొండః** మండల పరిధిలోని వల్లభి గ్రామంలో ఐకెపి, డిసిఎంఎస్, ఎస్ఎంఎస్‌ల ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పువ్వాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధి పనిచేస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, నేరుగా కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్‌బాబు, సొసైటి అధ్యక్షులు యల్లగొండ స్వామి, మేడిపల్లి సొసైటి అధ్యక్షులు సామినేని వెంకటయ్య, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పరసగాని తిరుపతిరావు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు వల్లూరు భద్రారెడ్డి, జోన్ ఇంచార్జి వడ్డెలి వీరరాఘవులు జోన్ చర్చ్ పందిరి అంజయ్య, మాజీ సర్పంచ్ బిచ్చాల భిక్షం, మాజీ ఎంపిటిసి చిమ్మసత్తి ఎల్లయ్య, నాయకులు చిమ్మసత్తి ఎల్లయ్య, ఏలూరు భాస్కరరావు, రాఘవ, బోయినపల్లి చంటి, సంగీతరావు, అన్వేష్, ఎస్‌కే గుడిసాహేబ్, వట్టికూటి ఉపేంద్ర, కాకర్ల మాధవరావు, రైతులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజం కోసం కృషి చేయాలి




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ర్యాగింగ్, మారకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అశ్వారావుపేట సిఐ పి.నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మారకద్రవ్య, ర్యాగింగ్ రహిత సమాజంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత లక్ష్యసాధన వైపు కృషి చేయాలని, తల్లిదండ్రులు కష్టాన్ని గుర్తించుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంతకుమార్ మాట్లాడుతూ కళాశాల చరిత్రలో ఎన్నడూ ర్యాగింగ్ లేదని, ఇకముందు కూడా ర్యాగింగ్ జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్ బారిన పడకుండా యాంటీ ర్యాంగింగ్ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ ఐ.విశ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ టి.శ్రవణ్‌కుమార్, డాక్టర్ ఎ.శ్రీజన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిపిఎం నుండి 35 కుటుంబాలు సిపిఐలో చేరిక

**- కండువా కప్పి ఆహ్వానించిన కల్లూరి**



**ప్రజాపక్షం/చర్ల :** మండల పరిధిలోని సిపిఎం పార్టీకి చెందిన 35 కుటుంబాల వారు బుధవారం సిపిఐ పార్టీలో చేరారు. చేరిన వారికి సిపిఐ డివిజన్ కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర రావు ఎర్రకుండువాలు కప్పి సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కల్లూరి మాట్లాడుతూ మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన పెద్ద ఎత్తున 35 కుటుంబాల వారు సిపిఎం నుండి సిపిఐలో చేరడం అభినందనీయం అన్నారు. సిపిఐ చేస్తున్న పోరాటాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చూపే కృషి కి ఆకర్షితులైన వారు సిపిఐ చేరినట్లు చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ అంటే నలుగురుకి ఆదర్శంగా నిలవాలని, నిత్యం పేద ప్రజల అభివృద్ధికి పాటుపడుతూ ప్రజలతో మమేకమై ముందుకు సాగుతుందని చెప్పారు. అందుకే సిపిఐ ఈ ఏడాది డిసెంబర్ 26తో వందేళ్ల పార్టీగా ఆవిర్భవిస్తోందని చెప్పారు. నూరేళ్ల చరిత్ర గల సిపిఐ శతవంసత ఉత్సవాలు ఖమ్మంలో 5 లక్షల మందితో ఘనంగా జరుగనున్నాయని, 40 దేశాల నుండి ప్రతినిధులు వస్తున్నారని చెప్పారు. డిసెంబర్ 26న జరిగే ఉత్సవాల ముగింపు సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాల రావు, చల్లా లక్ష్మీ నారాయణ, మండల ఆర్గనైజర్ ఎస్కే జాకీర్‌హుస్సేన్, మండల కార్యవర్గ సభ్యులు కోడి రెక్కల రాజారావు, ఉప్పులూరి నాగరాజు, ఉప్పులూరి వెంకట నరసమ్మ, కోట శంకర్ తదితరులు సమక్ష్యంలో పార్టీలో వానరాశిసారయ్య, జంపయ్య, ఆధ్వర్యంలో సమ్మక్క, భద్రమ్మ, వెంకన్న, రాంబాయమ్మ, బాబు, సారమ్మ, ధనలక్ష్మీ, వెంకటయ్య, సమ్మక్క, రాంబాబు, పద్మ, పెద్దిరాజు, సుశీల, సాయిలు, పోచమ్మ,రాజు, లక్ష్మీ, బాబు రచిత, సమ్మక్క, నర్సింహా, భాగ్యలక్ష్మీ, కృష్ణ, రమేష్, అనూష, అచ్చయ్య, ముత్యాలు, మల్లేష్, వీరబాబు, జ్యోతి, రాములు, ఎల్లమ్మ, రవి, సరిత, నాగేష్, కళ్యాణి, మణెమ్మ, శంకర్, నాగమణి, సురేష్, రాశి, భాగ్యలక్ష్మీ, సాయమ్మ,శివాజీ, సమ్మయ్య తదితరులు చేరారు.

# సిపిఐ శత వసంత ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేద్దాం

**- ఖమ్మంలో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ**
**- 40 దేశాల నుండి వస్తున్న ప్రతినిధులు**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం :** ఖమ్మం కేంద్రంగా డిసెంబర్ 26న జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రథం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని లక్ష్మీ నగరం పార్టీ కార్యాలయంలో సిపిఐ కౌన్సిల్, కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ గడ్డపై సిపిఐ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటుందని, దేశంలో వందేళ్ల చరిత్ర గల పార్టీ సిపిఐ ఒక్కటే అన్నారు. భారతదేశ స్వతంత్రాని కంటే ముందే పార్టీ కాన్పూరులో పుట్టిందని, దేశ స్వతంత్ర సంగ్రామంలో సిపిఐ కీలక పాత్ర పోషించదని చెప్పారు. నాట నుండి నేటి వరకు బడుగు బలహీన వర్గాలకు అండగా ఉందని, మరో వందేళ్లయినా ప్రజలతోనే ఉంటుందని చెప్పారు. ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు తరలివస్తున్నారని, ఐదు లక్ష్యల మందితో కనీవినీ ఎరుగని రీతిలో బహిరంగ సభ జరగనుందని చెప్పారు. ఈసభ విజయవంతానికి వేలాదిగా తరలిరావాలన్నారు. అనంతరం మహాసభకు చెందిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొల్లోజు వేణు, సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, సీనియర్ నాయకులు నోముల రామిరెడ్డి, కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు పాయం ఎర్రయ్య, పాయం రాజు, గొంది నాగేశ్వరరావు, కొర్సా కోటేష్, రాచకొండ సురేష్,బొనగాల లింగయ్య, రాజిరెడ్డి, పొడియం మణీందర్, అంజిరెడ్డి, చెంచల కృష్ణ, పెనుబల్లి లక్ష్మీ భాయి, కారం రమణమ్మ, కొమరం బాలకృష్ణ, తాటి నాగేశ్వర రావు, కోడి నాగేశ్వరరావు, కుంజ సత్తిబాబు, మడకం ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆమె వస్తే మేము డ్యూటీ చేయం..!

**- విధులు బహిష్కరించిన ఆబ్కారీ సిబ్బంది**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆ అధికారి వేదింపులు మేము తాళలేము.... తాను విధులకు వస్తే మేము డ్యూటీ చేయలంటే అంటూ ఎక్సైజ్ సిబ్బంది విధులు బహిష్కరించిన ఘటన మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. గత కొద్దిరోజుల క్రితం ఎక్సైజ్ సిఐ వేదింపులు తాళలేక ఓ మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్ నిద్రమాత్రలు వేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంగతి విధితమే. కాగా ఎక్సైజ్ సిఐ సిబ్బందిని తీవ్రంగా వేదిస్తుంటుందని, విధులు పట్ల ఎంక అంకిత భావంతో ఉన్నా సూటిపోటి మాటలంటూ కించపరిచే విధంగా ప్రవరిస్తారని ఆ నాడు సిబ్బంది మహిళా కానిస్టేబుల్‌కు మద్దతు తెలిపారు. అయితే ఆమె తీరుపై ఎక్సైజ్ ఉన్నతాధికారి విచారణ చేపట్టి నివేదికను సిద్ధం చేసి కమీషనర్‌కు పంపించారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ సంఘటన జరిగిన నాటి నుండి సోమవారం వరకు విధులకు రాని సిఐ మంగళవారం విధుల్లోకి రావడంతో అధికారులు చర్యలు తీసుకుంటామని మాటిచ్చారని, కానీ ఆమె విధుల్లోకి రావడంతో ఇచ్చిన మాట తప్పారని, కాబట్టి తాము ఆ అధికారి వద్ద పని చేయలేమంటూ విధులు బహిష్కరించారు. కాగా కలుగ జేసుకున్న ఉన్నతాధికారులు సిబ్బందికి సర్ది చెప్పి విధుల్లోకి వెళ్లేలా చేశారు. ఈ విషయంపై అబ్కారీ సూపరింటెండెంట్ జానయ్యను వివరణ కోరగా సిబ్బంది విధులు బహిష్కరించిన విషయం తనదాకా రాలేదని, అయినా జరిగిన ఘటనపై విచారణ చేపట్టి కమీషనర్‌కు నివేదించామని, ఆ నివేదిక ఆధారంగా మాకు వచ్చే ఆదేశాలను బట్టి నడుచుకుంటామని అన్నారు.

## ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** వరి పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని జూపెడ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్, మండల వ్యవయసాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి, ఎపిఎం కలకోట సంపత్‌కుమార్, గ్రామల పెద్దలు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, విష్ణు, ఐకెపి సిబ్బంది వసంత తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల ప్రాథమిక సహకార సంఘం గుంపెన వారి ఆధ్వర్యంలో గుంపెన సొసైటీ అధ్యక్షులు బోయినపల్లి సుధాకర్ రావు వ్యవసాయ అధికారుల సమక్షంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా అధ్యక్షులు బోయినపల్లి సుధాకర్‌రావు మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి మండలంలోని రైతులందరూ ధాన్యాన్ని దళారుల చేతికి అప్పగించకుండా సరైన పద్ధతిలో ధాన్యం కొనుగోలు కేంద్రం వారు నిర్ణయించిన నిర్ణీత ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని ఆరబోసుకొని తేమ శాతం సరిగా ఉండేలా చూసుకొని సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్నికి తీసుకొని వచ్చి గిట్టుబాటు ధరను పొంది లాభపడాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎటువంటి అవకతవకలు జరిగిన మా దృష్టికి తీసుకురావాలని వాటిని సకాలంలో సరిచేసి రైతులకు లబ్ది చేకూరేలా పరిష్కరిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో అశ్వారావుపేట ఏడిఏ పి రవికుమార్, మండల వ్యవసాయ అధికారి అనూష, విద్యుత్ శాఖ ఏఈ సాయి తరుణ్, విస్తరణ అధికారి ప్రశాంత్, సరిత దేవి, ప్రాథమిక సహకార సంఘం సీఇఓ కే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వెంకట నారాయణ, డైరెక్టర్ కోటి వెంకటేశ్వరరావు, గాలం కాటం రాజు, రైతులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

**రూ.30 వేల నగదు...నిత్యావసర వస్తువులు దగ్ధం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ఓ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైంది. బాధితురాలి కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం కు చెందిన సుభద్ర అనే నివాసంలో అకస్మికంగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్న వస్త్రలు, నిత్యవసర సరుకులు. రూ.30 వేల నగదు మంటలలో అహుతైయ్యాయి. స్థానికులు గమనించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లేని పక్షంలో మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొన్నారు. నగదు తో పాటు వివిధ నిత్యవసర సరుకులు, వస్త్రలు వస్తువులు అన్ని కలిపి దాదాపు రూ.70 వేల కు పైగా నష్టపోయినట్లు బాధితురాలు పేర్కోన్నారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకుంది.

## అయ్యప్ప భక్తుల ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అయ్యప్ప భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవి భవన్ కు చెందిన భక్తులు శ్రీ వేణు గోపాలస్వామి దేవాలయం, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆకుపూజ నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు బాగుండాలని కోరుతూ, పూజలు చేపట్టారు. ఆయప్ప భక్తిగీతాలతో ఆటా, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కె.కోటేశ్వరరావు, పావులూరి వెంకటేశ్వరరావు, కొమ్మూరి నరేష్, నాసరయ్య, ఆంజనేయలు, శ్రీనివాసరావు, శంకర్, ఉదయ్, మాదాసు శ్రీనివాసరావు, చారీ, పావులూరి కోటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అండర్19 రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు బోదులబండ కు చెందిన గండారపు వెంకటసాయి ఎంపికైయ్యారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని బోదులబండ గ్రామానికి చెందిన గండారపు వెంకటసాయి అథ్లెటిక్స్ లో రాష్ట్ర స్థాయి లో జరిగిన పోటీలలో ప్రతిభ చూపారు. ఆరు కిలోమీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో రెండు రజిత పధకాలను గెలుచుకున్నాడు. హర్యానా రాష్ట్రంలో, జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు స్థానికులు గుండు మహేష్, అనంతు రవి, కాసాని విగ్నేష్, చింతలపాటి లెనిన్ అభినందించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచటానికి జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం చికిత్స తీసుకొన్నారు. అనారోగ్య సమస్యతో ఆసుపత్రికి వెళ్ళిన ఆయన వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ ఆసుపత్రికి చ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కోరారు. వైద్యులు సిబ్బంది సమయ పాటించాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం, కలగకుండా త్తమమైన వైద్య సేవలను అందించాలని ఆదేశించారు.

## ఇల్లందు పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడిగా సిలివేరు



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడిగా సిలివేరు సత్య నారాయణను నియమించారు. పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎంఎల్ఏ బానోత్ హరిప్రియ మంగళవారం నియామక ఉత్తర్వులు అందించారు. రాష్ట్ర పార్టీ ఆదేశంపై సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు సత్య నారాయణను నియామకం పట్ల ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## హెల్త్ సెంటర్‌ను సందర్శించిన డిఎంఅండ్‌హెచ్ఓ

**ప్రజాపక్షం/పాల్వంచ :** మెరుగైన సేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ తుకారాం అన్నారు. ఉల్వనూర్ గిరిజన ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పట్టణ పరిధి బొల్లోరిగూడెంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆయన సంధర్శించారు. ఈ సంధర్భంగా రికార్డులను పరిశీలించారు. పలు సలహాలు, సలహాలు అందించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుకృత, సిహెచ్ఓ కనకదుర్గ, డిఎంఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ ఎన్.టి.ఆర్ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు టీ శాట్ అండ్ టిఎస్ జిహెచ్ఎంఏ సంయుక్తంగా మండల స్థాయిలో సోమవారం నిర్వహించిన వక్తృత్వం పోటీలలో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికైనారు. మంగళవారం జిల్లా స్థాయిలో నిర్వహించిన డిబేట్ లో పి. దుర్గా చరణ్, క్విజ్ లో విమల్ కిరణ్, దుర్గా చరణ్, రాఘవేంద్ర, నాయేరంలు ద్వితీయ స్థానం సాధించి, సత్తుపల్లి ని జిల్లా స్థాయి లో నిలిపినట్లు పాఠశాల హెడ్ మాస్టర్ రామ్మోహన్ రావు తెలిపారు. విద్యార్థులను మండలవిద్యా శాఖధికారి ఎన్. రాజేశ్వరరావు, కాంప్లెక్స్ హెచ్ ఎం ఆర్. శైలకుమారిలు అభినందనలు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని కొనుగోలు కేంద్రాలలో సౌకర్యాలు కొరతతో రైతుల ఇబ్బందులు వార్తపై అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి స్పందించి కల్లూరు మండల పరిధిలోని లింగాల, పుల్లయ్య బంజర, ఎర్ర బోయినపల్లి తదితర కొనుగోలు కేంద్రాలను సందర్శించి పూర్తి స్థాయిలో సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చేసేందుకు ప్రణాళికలు చేపట్టారు. పుల్లయ్య బంజర్ లో సన్నాలలో బెరుకులు సమస్య లింగాలలో ట్యాబ్ ఎంట్రీ సమస్యను పరిష్కరించారు. అదే విధంగా ఎర్రబోయినపల్లి కొనుగోలు కేంద్రంలో ఉన్న సమస్యను ఫోన్‌లో సమాచారం తెలుసుకొని పరిష్కరించారు. కొనుగోలు కేంద్రాలలో పూర్తిస్థాయి సౌకర్యాలను కల్పించాలని ఇన్చార్జిలకు ఆదేశాలు ఇచ్చారు. రైతులకు సౌకర్యాలు ఏర్పాటుపై నిర్లక్ష్యం ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని జేసి తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారిని శ్రీలత, డీఎస్ఓ చందన్ కుమార్, సివిల్ సప్లై




డిటి నరేష్, తహశీల్దార్ పులి సాంబశివుడు, ఐకెపి ఎపిఎం అశోక్ రాణి, వ్యవసాయ శాఖ అధికారులు రూప, ఏఈవోలు దీపిక, పవన్, వెంకట లీల, ఐకెపి డిసిఎంఎస్, పిఎ సిఎస్ మెప్మా శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు కమిటీలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

**సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం**




**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, ఖమ్మం జిల్లాలో రబీ సీజన్ సన్న ధాన్యం బోనస్ పెండింగ్ డబ్బులు రూ.63కోట్లు విడుదల చేయాలని సిపిఐ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో సిపిఎం వైరా పట్టణ కమిటీ సమావేశం బొంతు సమత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ) పత్తి కొనుగోలు నిబంధనలు రైతులకు నష్టం చేస్తాయని, సిసిఐ విధించిన కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్, తేమశాతం 8 నుంచి 12 శాతం ఉండాలి. ఎకరాకు ఏడు క్వింటాల్లా కొనుగోలు నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలని కోరారు. వరి, పత్తికి తేమ శాతం 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎడతెరిపి లేని అధిక వర్షాలు మూలంగా దెబ్బతిన్న అన్ని రకాల పంటలకు పరిహారం చెల్లించాలని క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని సర్వే చేసి ఎకరాకు రైతులకు రూ.30వేలు, కౌలు రైతులకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, కమిటీ సభ్యులు గుడిమెట్ల రజిత, హరి వెంకటేశ్వరరావు, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్‌రావు, కొంగర సుధాకర్, సంక్రాంతి నరసయ్య, అనుమోలు రామారావు, షేక్ నాగుల్‌పాషా, తోట కృష్ణవేణి పాల్గొన్నారు.

# ఆంధ్రా టు వైరా ఇసుక దందా..!

**-అక్రమ ఇసుక తోలకాలకు గ్రీన్‌ఫీల్డ్ హైవే మార్గం**
**-ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను దోచుకుంటున్న వైనం**



**ప్రజాపక్షం/వైరా:** ఆంధ్రా టు వైరా జోరుగా లారీల్లో ఇసుక రవాణా కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి లారీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తీసుకొని వచ్చి వైరా సమీపంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్‌హైవే రోడ్డులో అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఎలాంటి బిల్లులు లేకుండానే ఇసుక తోలకాల్లో జీరో దందాలను నడిపిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం నిర్మించేందుకు ఇందిరమ్మ ఇళ్లను ప్రవేశపెట్టింది. అయితే ఈ క్రమంలో వారి అవసరాలను ఆసరాగా చేసుకొని ఆంధ్రప్రదేశ్ నుంచి వైరాకు వస్తున్న అక్రమ ఇసుక వ్యాపారాలు అందినకాడికి దోచుకుంటున్నారు అనే ఆర్పోణ వినిపిస్తున్నాయి. రోజు పెద్ద సంఖ్యలో అక్రమ ఇసుక లారీలు వైరాకు వస్తున్నారు. ఇటు తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఆదాయంకు గండి కొడుతూ ఆంధ్రా నుంచి వైరాకి అక్రమంగా ఇసుక రోజు జోరుగా పెద్ద ఎత్తున తరలివస్తుంది. ఆంధ్రా నుంచి లారీలతో తీసుకొని వచ్చే ట్రాక్టర్లలో దంపు చేసుకొని వాటిని తీసుకొచ్చి దందా కొనసాగిస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో నిఘా పెడితే ఎలాంటి అమనుతులు లేకుండా జరుగుతున్న జీరో దందా ఇసుక వ్యాపారం బట్టబయలవుతుందని చెప్పవచ్చును. ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ జీరో బిల్లు వ్యాపారం కొనసాగిస్తున్న వారిపై అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# మెగా వైద్యశిబిరం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో ఐటిడిఎ పిఓ సహకారంతో అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఐటిడిఎ పిఓ రాహుల్ ముఖ్యఅతిధిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో మొత్తం 625 మంది ప్రజలు పాల్గొని వివిధ రోగాలకు చికిత్స పొందారు. ఈ వైద్యశిబిరానికి రెడ్డిగూడెం నుండే కాకుండా చుట్టూ పక్కల గ్రామాల నుండి ప్రజలు వచ్చి వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల తహశీల్దార్ సిహెచ్.రామకృష్ణ, ఎంపిడిఓ బి.అప్పారావు, ఎంపిఓ రామకోటారెడ్డి, ఐసిడిఎస్, సిడిపిఓ సిబ్బంది, వినాయకపురం వైద్యాధికారి డాక్టర్ రామదాస్ పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈ నెల 28,29,30వ తేదీలలో సూర్యాపేట పట్టణంలో జరగనున్న కల్లుగీత కార్మిక సంఘం నాలుగవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడుగ్రామంలో గల సంఘం కార్యాలయంలో ముఖ్యమైన సంఘం సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.4వేలు, ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రమాదాలకు గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా రూ.12కోట్ల60లక్షలు వెంటనే విడుదల చేయాలన్నారు. చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి 560 జీవో ప్రకారం 5ఎకరాల భూమితో పాటు పల్లె గీత కార్మికులందరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ ఏరియాలో రద్దైన సొసైటీలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. గీత కార్మికులందరు ఐక్యమై పోరాటం చేసి మన సమస్యలను సాధించుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి సొసైటీ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు, సభ్యులు బోనపల్లి సంఘయ్య, కొండం కృష్ణ, మీది వెంకటేశ్వర్లు, పరికపెల్లి సుదర్శన్, మడికంటి శంకర్, తాళ్లపల్లి సత్యనారాయణ, బోనెపల్లి వెంకటనారాయణ, సత్యం, కొండం మధు, శేఖర్, అండం శేఖర్, మొక్క భాస్కర్, కృష్ణ, తొండల నాగయ్య , గడ్డమీది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి టిప్పర్ పట్టివేత

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని వెన్నవల్లి గుట్ట నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న గ్రావెల్ టిప్పర్‌ను మంగళవారం చేశారు సీజ్ చేసి డ్రైవర్, లారీ ఓనర్ దొడ్డి రాజేష్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేని ఎలాంటి తోలకాలను అడ్డుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు. మండలంలో అక్రమంగా యదేచ్ఛగా తోలుతున్న మట్టి తోలకాలను అడ్డుకొని కేసులు నమోదు చేస్తామని వారు పేర్కొన్నారు.

# వైరా విద్యుత్‌శాఖ డిఈ శ్రీనివాసరావు బదిలీ

**-ఇంచార్జి డిఈగా చిన్న బాబురావు?**



**ప్రజాపక్షం/వైరా:** వైరా విద్యుత్‌శాఖ డిఈగా పనిచేస్తున్న బండి శ్రీనివాసరావు నూతనంగా ఏర్పడిన మధిర విద్యుత్‌శాఖ డిఈగా బదిలీపై మధిర వెళుతున్నారు. వైరా విద్యుత్‌శాఖ డిఈగా ఖమ్మంలో డిఈ టెక్నికల్‌గా పనిచేస్తున్న వి.చిన్నబాబురావు తాత్కాలిక వైరా ఇంచార్జి డివిజన్ డిఈగా బాధ్యతలు చేప్టనున్నట్లు సమాచారం.

# బస్సు, టాటా ఏసి ఢీ

**-ప్రయాణీకులకు తప్పిన పెను ప్రమాదం**



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో రింగు రోడ్డు వద్ద వైరా బస్టాండ్ నుండి మణుగూరు వెళుతున్న టిఎస్28 టిబి3677 ఆర్‌టిసి బస్సు తల్లాడ వైపు నుండి ఖమ్మం వెళుతున్న టిఎస్04యుఇ6371 టాటా ఏసి వాహనం ఢీకొన్న సంఘటన మంగళవారం ఉదయం 6గంటలకు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులకు అలాంటి ప్రమాదం తప్పడంతో ప్రయాణీకులు అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో ప్రయాణీకులను ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్ దింపి వేరే బస్సు ఎక్కించి పంపించారు. విషయం తెలుసుకున్న వైరా రెండో ఎస్సై పవన్ పోలీసులను సంఘనా స్థలం వద్దకు పంపించడంతో అక్కడికి వచ్చిన పోలీసులు ప్రమాదం తీరును పరిశీలించి వాహనాలు రెండింటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు విచారణ చేపట్టారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలంలో ఇసుక రేవుల్లో ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే ఇసుక కూపన్లు జారీ చేశామని, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో వేరే నిర్మాణాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మన్నె ఉషాశారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సౌకర్యం కోసం మీనవోలు రేవుతో పాటు తక్కెళ్లపాడు, సఖినవీడు గ్రామాల్లో ఇసుక రేవులకు కూడా కూపన్లు జారీ చేసినట్లు తెలిపారు. కేవలం ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే ఇసుక కూపన్లు జారీ చేశామని, ఇసుక తరలించే క్రమంలో ట్రాక్టర్ల వెసులుబాటు కోసం ఇసుక రేవుల్లో జెసిబి వగైరా మిషన్లతో ఇసుక తోడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ర్యాంపుల్లో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇసుకను తోలుకోవచ్చునని, ఇసుక కూపన్లు, సరఫరా విషయంలో ఐకెపి డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక తరలింపుపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# ఘనంగా మండల నాయిబ్రాహ్మణ వన సమారాధన



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** జమలాపురం శ్రీ వెంకటేశ్వర నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎర్రుపాలెం మండల నాయి బ్రాహ్మణ వన సమారాధన కార్యక్రమం జమలాపురం వాసిరెడ్డి దుర్గాప్రసాద్ మామిడితోటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేసి పాలు పొంగళ్లు చేశారు. ఈ వన సమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా తెలంగాణ నాయిబ్రాహ్మణ సమైక్య సంక్షేమ సంఘం అధ్యక్షులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం జిల్లా అధ్యక్షులు తూముల నాగభూషణం హాజరయ్యారు. వారిని మండల నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసిసెల్ ఉపాధ్యక్షులు మాదారపు హరినాథ్, జిల్లా ఐక్యవేదిక గౌరవాధ్యక్షులు ఆలేటి వెంకటప్పయ్య, గౌరవ సలహాదారు లింగంపల్లి అప్పారావు, సింగారపు చంద్రమౌళి, గౌరవాధ్యక్షులు వేములపల్లి శంకర్, నాగరాజు, వినుకోల్లు సాయిబాబు, నాగుల్వంచ శ్రీనివాసరావు, రామ్మూర్తి, నాగేశ్వరరావు, సాయిరాం వేణు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ 4.0

**ప్రజాపక్షం/ఇల్లందు:** కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా అన్ని సంస్థల పెన్షనర్లలో డిజిటల్ సాధికారత పెంపు కోసం నిర్వహిస్తున్న డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0లో భాగంగా మంగళవారం సింగరేణి ఇల్లందు ఏరియా పరిధిలోని యైసిఓఏ క్లబ్, ఓల్డ్ కాలనీ నందు సింగరేణి, బొగ్గు గనుల భవిష్యనిధి సంస్థలు సంయుక్తంగా సిఎంపిఎఫ్ పెన్షన్ పొందు వారికి, సిపిఆర్ఎంఎస్ కార్డులు గల మాజీ ఉద్యోగులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పణ విధానంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏజియంఐఇడి గిరిధర్‌రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, అధికారుల సంఘం అధ్యక్షులు ఎజి శివప్రసాద్, గుర్తింపు సంఘం నుండి రాజారామ్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు జె వెంకటేశ్వర్లు, దిలీప్ కుమార్, మహేశ్వరరావు, బి నాగేశ్వర్‌రావు, జి సుధాకర్, అన్నీ గనుల సంక్షేమ అధికారులు, విభాగ క్లర్కులు, మాజీ సింగరేణి ఉద్యోగులు, సిఎంపిఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.